
రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:26 బుధవారం
సహర్ 4:51 గురువారం

- ఎల్ఎండీలో ఆరు టీఎంసీలకు పడిపోయిన నీటిమట్టం
- 10 రోజుల్లో తగ్గిన 1.5 టీఎంసీల నీరు
- నెలాఖరు వరకు నాలుగు టీఎంసీలకు చేరే అవకాశం

తాగునీటికి కటకట



కరీంనగర్ టౌన్, మార్చి 19: కరీంనగర్‌లో తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. ఓవైపు మండుతున్న ఎండ లు, మరోవైపు గత సంవత్సరం మాదిరిగా మిడ్‌మానేరు, ఎస్సారెస్పీ కాలువల నుంచి నీరు రాక పోవడం, దిగువకు సాగు అవసరాలకు నీటిని వదల డంతో లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండీ)లో నీటి నిలువలు గణనీయంగా తగ్గిపో యాయి. గత యేడాది మార్చి19న 12.050 టీఎంసీల నీటితో కళకళలాడిన ఇప్పుడు నీరులేక మైదానాన్ని తలిపి స్తోంది. ఈ రిజర్వాయర్‌లో సరిగ్గా పది రోజుల క్రితం మార్చి 9న 7.496 టీఎంసీల నీరు నిలువ ఉండగా మంగళ వారం నాటికి 6.024 టీఎంసీలకు పడిపోయాయి. పది రోజుల వ్యవధిలోనే దాదాపు 1.5 టీఎంసీల నీరు తగ్గిపోయింది. మరోవైపు ఎల్ఎండీ, మిడ్ మానేరు డ్యాం, వరద కాలువతోపాటు కొత్తపల్లి చెరువులో నీటి నిలువలు తగ్గ డంతో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో ఇప్ప టికే కరీంనగర్‌తోపాటు పరిసర గ్రామాల్లోని బోరుబా వుల్లో నీటి నిలువలు పడిపోయి నీరు రానిపరిస్థితి నెలకొంది.

● మండుతున్న ఎండలు

వేసవి ప్రారంభం నుంచే ఎండలు మండిపోతూ 36 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పు డే ఈ పరిస్థితి ఉంటే మార్చి, ఏప్రిల్, మే వరకు ఉష్ణో గ్రతలు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందు తున్నారు.కరీంనగర్‌కు తాగునీటిని, వరంగల్, ఖమ్మం జిల్లాలకు సాగునీటిని అందిస్తున్న ఎల్ఎండీలో నీటిమట్టం నెలరోజుల క్రితమే డెడ్ స్టోరేజీకి చేరుకుంది. 24.034 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఎల్ఎండీలో ప్రస్తుతం 6.024 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ రిజర్వాయర్‌కు ప్రతిరోజు మిడ్ మానేరు నుంచి 1,467 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇక్కడి నుంచి కాకతీయ కెనాల్ ద్వారా 3,125 క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువల ద్వారా సాగు నీటి అవసరాల కోసం దిగువకు విడుదల చేస్తున్నారు. మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరాకు 143 క్యూసెక్కులు, మరో 120 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది. ప్రతిరోజు ఎల్ఎండీ నుంచి 3,388 క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లో ఉండగా, 1,467 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో ఉండడంతో నీటి నిలువలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి.

● నగరానికి ప్రతి రోజు 55 మిలియన్ లీటర్లు

ప్రతిరోజు నగర ప్రజలకు మంచినీటిని అందించేందుకు నగరపాలక సంస్థ 55 మిలియన్ లీటర్ల నీటిని ఆన్‌లైన్ బూస్టర్ పంపుల ద్వారా ఎల్ఎండీ నుంచి డ్రా చేసి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తోంది. దీంతో ఐదు రోజులకు ఒక టీఎంసీ చొప్పున ఎల్ఎండీ నుంచి నీరు విడుదల అవుతున్నందున మార్చి 31 వరకు మరో రెండు టీఎంసీల నీరు తగ్గి నాలుగు టీఎంసీలకు చేరుతుందని భావిస్తు న్నారు. కరీంనగర్‌తోపాటు మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరాకు అంతరాయం కలగవద్దని ప్రభుత్వం ఆలోచన చేసి ఎస్సారెస్పీ లేదా మిడ్ మానేరు నుంచి కనీసం నాలుగు టీఎంసీల నీటిని ఇవ్వని పక్షంలో కరీంనగర్ ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదే పరిస్థితి నెలకొంటే వచ్చే ఏప్రిల్ 10వ తేదీ వరకు 5.3 టీఎంసీలకు నీటి నిలువలు పడిపోతాయని, ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవా లంటూ ఇరిగేషన్‌శాఖ అధికారులు ఇప్పటికే నగరపాలక సంస్థకు లేఖ రాశారు. ఏప్రిల్ 1 నాటికే 5.3 టీఎంసీల నీరు కాదు కదా నాలుగు టీఎంసీలకు మించి నిలువ ఉండే అవకాశమే ఉండదని చెబుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతినడంతో నీటికి ఇబ్బందులు మొదలయ్యాయి. మూడు నెలలుగా ఎల్ఎండీరిజర్వాయర్లలో నీటి మట్టం తగ్గింది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ బూస్టర్ పంపుసెట్ల ద్వారా ఎల్ఎండీ నుంచి నీరు తీసుకొని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు.

ఎల్ఎండీలో ఎనిమిది టీఎంసీలు నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలి

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

నగరంలోని ఐదు లక్షల జనాభాకు మంచినీటిని అందిస్తున్న లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండీ)లో కనీస నీటినిలువలు 8 టీఎంసీలు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నగర ప్రజల దాహార్తిని తీర్చుతున్న ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీటిని నిలువలు ఆరు టీఎంసీలకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. హైలెవల్ జోన్ పరిధిలోని మూడు, నాలుగు రిజర్వాయర్ల పరిధిలో ఇప్పటికే మంచినీటి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు నీటిని ఈ రిజర్వాయర్ల ద్వారా ఇవ్వలేక పోతున్నాము. ఏప్రిల్ 10 వరకు 5.3 టీఎంసీలకు నీటి నిలువలు చేరుకుంటాయని అధికారులు చెబుతున్నా ఐదురోజులకు ఒక టీఎంసీ చొప్పున నీటి నిలువలు పడిపోతున్నందున ఏప్రిల్ 1 వరకే నాలుగు టీఎంసీలకు నీరు పడిపోతాయి. ఇదే జరిగితే లోలెవల్ పరిధిలోని రిజర్వాయర్ల నుంచి కూడా ప్రతిరోజు నీటి సరఫరా ఇవ్వడం కుదరదు. మిషన్ భగీరథ ద్వారా నగరంలోని విలీన డివిజన్లు, సమీప గ్రామాల్లోనూ నీటి ఇబ్బందులు తప్పవు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఎస్సారెస్పీ నుంచి 5 టీఎంసీల నీటిని ఎల్ఎండికి వదిలి 8 టీఎంసీలు నీరు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

● హై లెవల్ జోన్ పరిధిలో ఇబ్బందులు

హైలెవల్ జోన్ పరిధిలోని మల్కాపూర్, ఎస్సారార్ కళాశాల, అంబేద్కర్ రిజర్వాయర్ల పరిధిలో ప్రతిరోజు మంచినీటి సరఫరా చేయక పోవడంతో ఆయా రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాల ప్రజలు మంచినీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. లో లెవల్ రిజర్వాయర్ల పరిధిలో ఎప్పటిలాగే ప్రస్తుతం ప్రతిరోజు నల్లా నీటి సరఫరా జరుగుతోంది. ఏప్రిల్ 1వ తేదీకి ఎల్ఎండీలో నాలుగు టీఎంసీలకు నీటి నిలువలు తగ్గితే ఈ రిజర్వాయర్లతోపాటు నగరమంతటా ప్రతిరోజూ మంచినీటిని ఇవ్వడం సాధ్యం కాదని, గతంలో మాదిరిగా రోజు విడిచి రోజు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. దీంతో బోరుబావుల్లో నీరు లేక, వేసవిలో నీటి అవసరాలు పెరుగుతున్న సమయంలో నల్లా నీరు కూడా ఇవ్వకుంటే తాగునీటితోపాటు ఇతర అవసరాలు కూడా తీర్చుకోవడమెలా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో మంచినీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను కార్పొరేటర్లు సభ దృష్టికి తీసుకురాగా నగరంలో ప్రతిరోజు మంచినీటిని అందించేందుకు ఎల్ఎండీలో 10 టీఎంసీల నీటి నిలువలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మరో పది, పదిహేను రోజుల తర్వాత మంచినీటి ఇక్కట్లు తప్పవని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్సెస్సీ పరీక్షలకు 31 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 19: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో రెండో రోజు మంగళవారం నిర్వహించిన ద్వితీయ భాష పరీక్షకు 31 మంది విద్యా ర్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు తెలిపారు. 12,434 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రా యాల్సి ఉండగా 12,420 మంది పరీక్షలకు హాజరుకాగా 14 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలకు హాజరు కావలసిన 28 మంది ప్రైవేట్ విద్యార్థుల్లో 11 మంది మాత్రమే పరీక్షలు రాశారని, 17 మంది హాజరుకాలేదని చెప్పారు. జిల్లాలోని 77 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతు న్నాయని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు, కాపీయింగ్ జరుగలేదని తెలిపారు. 23 పరీక్షా కేంద్రాలను ప్రత్యేక తనిఖీ బృందాలు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ నాలుగు కేంద్రాలను, జిల్లా విద్యా శాఖ అధికారి ఐదు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారని చెప్పారు. కలెక్టర్ పమేలాసత్పతి హుజురాబాద్ లోని ఒక పరీక్షా కేం ద్రాన్ని సందర్శించి సౌకర్యాలు, పరీక్షల నిర్వహణపై అడిగి తెలుసుకుని ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చూడాలని ఆదేశించినట్లు చెప్పారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట జడ్పీ హెచ్ఎస్ పరీక్షా కేంద్రంలో అను మతిలేని వాహనాలు న్నందున చీఫ్ సూపరిం టెండెంట్ రాజమౌళిని విధుల నుంచి తప్పించా మని తెలిపారు. మరో పరీక్షా కేంద్రంలో నిబంధనల మేరకు ఐడీ కార్డులు ధరించి విధులకు హాజరు కానీ చీఫ్ సూపరింటెండెంట్, ఇద్దరు ఇన్విజి లేటర్లను, ఇంకో పరీక్షా కేంద్రంలో విధులకు హాజరుకానీ ముగ్గురు ఇన్విజిలేటర్లకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు డీఈవో వివరించారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్ప వని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈ వో సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి 19: జిల్లా కేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో భాగంగా కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్య శిక్షణకు 18 సంవత్సరాలు నిండి, ఏడో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులని చెప్పారు. మూ డు నెలలపాటు శిక్షణ అందించి, అది పూర్తి అయ్యాక సర్టిఫికెట్ అందస్తారని తెలిపారు. కంప్యూటర్ కోర్సుకు 1000, బ్యూటీషియన్ కోర్సు కు 1,500 రూపాయల ఫీజు చెల్లించాల్సి ఉటుం దని తెలిపారు. వివరాలకు 9640967943, 99498 50360 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

● నేర సమీక్షా సమావేశంలో సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, మార్చి 19: కమిషనరేట్ వ్యాప్తంగా ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని పోలీసు అధికారులను సీపీ అభిషేక్ మొహంతి ఆదేశిం చారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగ ళవారం పోలీసు శాఖలోని అన్ని విభాగాల అధికారులు,


మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

ఎస్‌హెచ్‌వోలతో రానున్న లోక్ సభ ఎన్నికల నిర్వహణతో పాటు నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీపీ మాట్లాడుతూ సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అన్నారు. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఐదు చోట్ల అంతర్‌జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, చెక్‌పోస్టుల్లో విధుల్లో ఉండే సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. చెక్‌పోస్టులో విధుల్లో ఉన్న సిబ్బందికి మౌలిక వసతులు తాగునీరు, లైటింగ్ ఏర్పాటు చేశామని, రోడ్డుపై ఉండే సిబ్బంది వాహనదారులకు కని పించేలా రిఫ్లెక్టింగ్ జాకెట్లు ధరించాలన్నారు. చెక్‌పోస్టుల పనితీరును ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించి, చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండోవర్ చేసినవారి గడువు ముగిసిన వారిని తిరిగి బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలపై ఫ్లాగ్‌మార్చ్ సమయాల్లో ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. రాజకీయ పార్టీలు నిర్వ హించే ప్రచార సమావేశాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేక రించాలన్నారు. సమావేశం నిర్వ హించుకునే సమయం, ర్యాలీ వెళ్లే మార్గం, ఎంత మందితో నిర్వహి స్తున్నారనే సమాచారం తెలుసు కుని అందుకనుగుణంగా ఎటు వంటి గొడవలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పో లింగ్ కేంద్రాలన్నిటిని సంబంధిత పోలీస్ అధికారులు పరిశీలించాల న్నారు.

● పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సీపీ అభిషేక్

మొహంతి అన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, అందు కు కారణాలను సీపీ తెలుసుకున్నారు. త్వరగా కేసుల పరి ష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. భౌతిక నేరాలకు సంబంధించిన వారెంట్లను త్వరగా అమలు అయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, ఎటువంటి ఉల్లంఘన అయినా సంబంధిత సెక్షన్ల ఆధారంగా కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ, ఏసీపీలు నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్, శ్రీనివాస్(ఎస్‌బీఐ), మాధవి, విజ య్‌కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పనిచేయాలి

- ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడండి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో నిబంధనల మేరకు అధికారులు పని చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వివిధ పథకాల కింద ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రారంభించిన పనులను పూర్తి చేసేందుకు అధికారులు దృష్టి సారించాలని, ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నిబంధనలు పాటించక పోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలోని అభివృద్ధి పనుల వివరాలను, వాటి పురోగతిని అడిగి తెలుసుకొని వాటిపై దృష్టిపెట్టి పూర్తయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సీపీవో కొమురయ్య, ఇరిగేషన్‌శాఖ ఎస్ఈ శివకుమార్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● ఆరోగ్య కేంద్రం పరిశీలన

వీణవంక: మండలంలోని చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రికార్డులను పరిశీలించారు. ఆమె వేంట అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, మెడికల్ ఆఫీసర్ శ్రీ కీర్తన, ఆయుష్ డాక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి


హుజూరాబాద్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

హుజూరాబాద్: పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా రాసి మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించి, గైర్హాజరైన విద్యార్థుల గురించి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎండకాలం నేపథ్యంలో పరీక్ష రాసిన తర్వాత విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పరీక్ష జరిగే సమయంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ విజయ్‌కుమార్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శోభారాణి, డీవో సత్యప్రసాద్ పాల్గొన్నారు.

సైనిక్ సమాజ్ సురక్ష సమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

కరీంనగర్ క్రైం, మార్చి 19: కేంద్ర పారా మిలటరీ బలగాలలో ఉద్యోగాల కోసం మహిళా అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేస్తామని కరీంనగర్‌లోని సైనిక్ సమాజ్ సురక్ష సమితి ఆర్మీ మాజీ హవల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సైనికుడు మహిపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో జనరల్ డ్యూటీ విభాగంలో రాత పరీక్షలు పూర్తి చేసిన వంద మంది మహిళా అభ్యర్థులకు ఉచి తంగా గ్రౌండ్ శిక్షణతోపాటు ఉచిత మెడికల్ పరీక్షలు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఫిజికల్ ట్రైనింగ్ ప్రారంభమవుతుందన్నారు. మహిళా అభ్య ర్థులు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఉచిత శిక్షణ రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ 8309435264, 9055644400, 8886304040 నంబర్‌లో సంప్రదిం చాలన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

సుభాష్‌నగర్, మార్చి 19: మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర పశు ఆరోగ్య శాఖ 1962 ప్రాజెక్ట కో ఆర్డినేటర్ డాక్టర్ భాగీష్ మిశ్రా అన్నారు. కరీంనగర్‌లో 1962 సంచార పశు అంబు లెన్స్‌ను ఆయన మంగళవారం తనఖీ నిర్వహిచారు. ఈ సందర్భంగావాహనాన్ని నిర్వహిస్తున్న తీరు, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ సలీం, కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీజ, డాక్టర్ అనూష, సహాయ సిబ్బంది రవళి, రాజ్‌కుమార్, రోష్ని పాల్గొన్నారు.


కరీంనగర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



విస్తృతంగా వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం, మార్చి 19: లోకసభ ఎన్నికల నేపథ్యంలో కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు అప్ర మత్తమయ్యారు. ఎన్నికల నియామవళిని అమలు చేసే విధిలో భాగంగా కమిషనరేట్ వ్యా ప్తంగా మంగళవారం రాత్రి ఏకకాలంలో వాహ నాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువులు రవాణా చేసే చర్యలు అడ్డుకట్ట వేసేందుకు సీపీ అభిషేక్ మొహంతి ఐపీఎస్ ఆదేశాల మేరకు కమీషనరేట్‌లోని అన్ని పోలీసు ఠాణాల పరిధిలో తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ టౌన్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, కమాన్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గీతాభవన్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, ఎన్టీఆర్ చౌక్, రాంనగర్, పద్మనగర్, రాజీవ్‌చౌక్‌తో పాటుగా పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనువ మానితులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం వదిలిపెట్టారు. ఎన్నికల నియమావళి ముగిసే వరకు వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల నియమావళి పాటిం చాలని, ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు.

మహిళా కండక్టర్‌పై దాడి.. పోలీసులకు అప్పగింత

కోరుట్ల, మార్చి 19: మద్యం మత్తులో ఆర్టీసీ బస్సులోని మహిళా కండక్టర్‌పై ఓ ప్రయాణికుడు దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం కోరుట్లలో జరిగింది. వేములవాడ డిపోకు చెందిన బస్సు కోరుట్ల బస్‌స్టాండ్ నుంచి వేములవాడకు వెలుతుంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి ప్రయాణికుల తో పాటు బస్సు ఎక్కాడు. పట్టణంలోని నందీ చౌరస్తా ప్రాంతానికి చెరుకోగా మద్యం తాగి ఉన్న వ్యక్తి బస్సు కండక్టర్ టికెట్ విషయంపై ప్రశ్నించగా సదరు వ్యక్తి కండక్టర్‌పై దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించాడు. దీంతో డ్రైవర్ అప్రమత్తమై పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి బస్సును తీసుక పోయి అతనిని పోలీసులకు అప్పగించారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 19: మహిళపై దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దీటి తిరుపతిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని దీటి లక్ష్మికి ఆమె బావ శ్రీనివాస్‌తో కొంతకాలంగా ఇంటి పంపకం విషయంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో శ్రీనివాస్ కొడుకు తిరుపతి ఈ నెల 18న రాత్రి లక్ష్మీ ఇంటికి చేరుకొని గొడవకు దిగాడని చెప్పారు. అంతటితో ఆగని అతడు లక్ష్మిని అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఇంటి సమీపంలో ఉన్న పశుగ్రాసాన్ని దహనం చేశాడని తెలిపారు. బాధితురాలు లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

జనశక్తి నక్సలైట్ పేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కోనరావుపేట, మార్చి 19: జనశక్తి నక్సలైట్ పేరుతో ప్రజలను భయపెడుతూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం కొదురు పాక గ్రామానికి చెందిన చెన్నమనేని పురుషోత్తమరావు ప్రభుత్వ నిషేదిత విప్లవ సంస్థ జనశక్తి అరుణోదయ సంస్థలోపనిచేస్తున్నానని అమాయక ప్రజలను బెదిరిస్తూ పార్టీ ఫండ్ పేరిట ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నాడని పురుషోత్తమరావును కోనరావుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కుతరలించినట్లు తెలిపారు. జనశక్తి నక్సలైట్ల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టే వారి సమాచారం పోలీసులకు అందించాలని అన్నారు.

వడదెబ్బ తగలకుండా ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వెల్గటూర్, మార్చి 19: వేసవికాలంలో వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ సూచించారు. మంగళవారం వెల్గటూర్, కోటిలింగాల గ్రామాలలో ఉపాధాహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ముందు జాగ్రత్తగా ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ద్రావణం ప్రాముఖ్యతను వివరించి పాకెట్లు అందజేసినట్లు తెలిపారు. ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. శరీరంపై ఏర్పడే స్పర్శ లేని మచ్చలను అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గోడకూలి బాలుడి మృతి

మేడిపల్లి, మార్చి 19: సిమెంట్ గోడకూలి బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం మేడిపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మేడిపల్లి ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి శివారులో నిర్మిస్తున్న పౌల్ట్రీఫాంలో మహబూబాబాద్ జిల్లా వొడ్డెర గూడెం గ్రామానికి చెందిన సంపంగి సంగీత, శ్రీను దంపతులు తమ కొడుకు గణేష్(4)ను తీసుకొని కూలీపనులు చేయడానికి వచ్చారు. ఈ క్రమంలో అదే ఫాంలో పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన అమరగోని రాజు కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి సిమెంట్ గోడను ఢీకొట్టాడు. దీంతో సిమెంట్ గోడ పక్కనే నిద్రిస్తున్న బాలుడిపై గోడ కూలడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పొట్టకూటి కోసం వచ్చి తమ కుమారుడిని కోల్పోవడంతో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. తల్లి సంపంగి సంగీత ఫిర్యాదు మేరకు డ్రైవర్ అమరగోని రాజుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోపాల్‌రావుపేటలో బైక్ చోరీ

రామడుగు, మార్చి 19: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఇనుగుర్తి రఘువీర్ అనే వ్యక్తి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇంటి ముందు పెట్టిన యమహ బైక్‌ను దొంగిలించడంతో బాధితుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గత 15 రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో గ్రామస్థులు భయాందోళనకు గురి అవుతున్నారు. బస్టాండ్ వద్ద రాత్రి వేళల్లో షాపుల తాళాలు పగులకొట్టి నగదు, పరికరాలను ఎత్తుకెల్లిన సంఘటనలున్నాయి. సీసీ కెమరాలను ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కొడిమ్యాల, మార్చి 19: మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన గుడి మల్లారెడ్డి(65)కరీంనగర్ ఆసుపత్రిలో 10 రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. వయస్సు పైబడి, కుటుంబ పోషణ భారమై ఈ నెల 8న జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద మల్లారెడ్డి పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్లారెడ్డి భార్య గుడి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

27నుంచి వేములవాడలో శివకల్యాణోత్సవాలు

వేములవాడ, మార్చి 19: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో ఈ నెల 28వ తేదీన శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు శ్రీ శివకల్యాణోత్సవాలు జరుపనున్నారు. ఇందులో భాగంగా 28వ తేదీ గురువారం ఉదయం 10.50ని.ల నుంచి గం.12.55ల వరకు శ్రీపార్వతీరాజ రాజేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 30వ తేదీ శనివారం సాయంత్రం గం.3.05 ని.ల నుంచి శ్రీస్వామివారి రథోత్సవము నిర్వహిస్తారు.

ఐదు రోజులపాటు ఆర్జిత సేవల నిలిపివేత

శివ కల్యాణం ఉత్సవాల సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు పలు రకాల ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీ స్వామివారి నిత్యకల్యాణం, అభిషేకం, అన్నపూజ, లింగార్చన, సత్యనారాయణ స్వామి వ్రతము టికెట్లు సేవలను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. శివకల్యాణోత్సవము సందర్భంగా 28వ తేదీ శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00ల వరకు కోడె టికెట్లు జారీ నిలిపివేస్తామని, నిత్య చండి సహిత రుద్రహోమం టికెట్లు ఇవ్వబడవని వెల్లడించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానములో ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజులపాటు డోలోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 23వ తేదీ శనివారం సాయంత్రం ప్రదోష పూజ అనంతరం కామ దహనం నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.


శ్రీరాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, మార్చి 19: సైదాపూర్ మండలంలో పెర్కపల్లి గ్రామానికి చెందిన పోతరాజు ఓదయ్య(85) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓదయ్య భార్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందింది. అప్పటినుంచి ఓదయ్య మతి స్థిమితం ఉండడం లేదు. భార్య చనిపోయిందని ప్రతి రోజు భార్యను తలుచుకుంటూ ఆవేదన చెందేవాడు. మనస్థాపంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి ఓదయ్యను 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఓదయ్య అదే రోజు సాయంత్రం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడి కుమారుడు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ఇద్దరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం,మార్చి 19: ఫేస్‌బుక్ ద్వారా పరిచయమై దావత్ చేసుకుందామని పిలిచి దాడిచేసి అందినకాడికి దోచుకున్న వేములవాడ మండలంలోని చింతల్‌ఠాణాకు చెందిన సూరదేవయ్య, సూర సురేష్‌లను మంగళవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన ముక్క శ్రీనివాస్‌కు చింతల్‌ఠాణకు చెందిన సూర దేవయ్యలకు ఫేస్‌బుక్ ద్వారా 15 రోజుల క్రితం పరిచయం ఏర్పడిందన్నారు. ఈ పరిచయమే దావత్ చేసుకోవాలని నిర్ణయించుకోవడంతో బొల్లారం నుంచి చింతల్‌ఠాణకు శ్రీనివాస్ వచ్చాడన్నారు. ఈనెల 17న బాబయ్ దేవయ్య, అబ్బాయ్ సురేష్‌లు ముందుగానే మద్యం సేవించి సిరిసిల్ల పాత బస్టాండ్‌లో తాను బస్సు దిగగానే బైపాస్‌రోడ్డు వద్దకు తీసుకెళ్లి తనపై దాడిచేసి రూ.3 వేలు, సెల్‌ఫోన్ లాక్కున్నారని బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదుచేసి చంద్రంపేట ఎక్స్ రోడ్డు వద్ద అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు.

అంజన్న టెండర్ సొమ్ముల స్వాహాపై విచారణ

మల్యాల, మార్చి 19: కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో టెండర్‌దారులు చెల్లించిన సొమ్ములను ఆలయ అధికారి దేవస్థానం ఖాతాలో జమచేయకుండా స్వాహా చేయడంపై పత్రికల్లో వచ్చిన కథనాలతో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కే.జ్యోతి మంగళవారం విచారణ జరిపారు. టెండర్ల విభాగం అధికారి శ్రీనివాసాచారి దాదాపు రూ.37లక్షల మేర సొమ్ములను దుకాణదారుల వద్ద వసూలు చేసి దేవస్థానం పద్దుకు చేర్చకపోవడంతో కొన్నాళ్ల క్రితం ఈ విషయం తీవ్ర దుమారం లేపింది. దీంతో అతన్ని దేవస్థానం అధికారులు సస్పెండ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో కేసు ఫిర్యాదు చేశారు. ఇటీవల మరో రూ.11లక్షల వరకు కూడా తేలగా సదరు అధికారి గత 2020 నుంచి 2023 వరకు నిర్వహించిన టెండర్ విభాగంలో జరిగిన ఈ స్వాహా పర్వంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. 2022-23 సంవత్సరంలోనే అధికంగా దాదాపుగా రూ.50లక్షల మేర సొంతానికి వాడుకున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అనంతరం క్యాష్‌బుక్ తదితరవి ఏడీసీ స్వాధీనం చేసుకొని తీసుకెళ్లారు. టెండర్ల లావాదేవీలకు సంబంధించిన బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్ తీసుకు రావాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. 2018-19లో ఆడిట్ అధికారులు అనేక అభ్యంతరాలతో కూడిన నివేదిక ఇవ్వగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంపై ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. డీసీబీ, సీబీ, ఆడిట్ నివేదికలను కూడా ఏడీసీ తీసుకెళ్లగా విచారణ నివేదికను కమిషనర్‌కు అందించనున్నట్లు ఏడీసీ ఈ సందర్భంగా తెలిపారు. అక్రమాలకు పాల్పడినట్లు రుజువు అయితే అందరిపై చర్యలు తప్పవన్నారు. ఈ విచారణలో కరీంనగర్ ఏసీ చంద్రశేఖర్, ఈవో వెంకటేష్, ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు శ్రీని వాస్‌శర్మ, సునీల్ ఉన్నారు. ఈ విచారణలో మరింత అక్రమాలు బయటకు వచ్చే అవకాశం ఉందని, అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల వారి పాత్రపైనా విచారణ జరిపించాలని డిమాండ్ వినిపిస్తోంది.


పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ జ్యోతి

నెమలిని వేటాడిన వ్యక్తి అరెస్టు

- ప్రధాన నిందితుడు సత్యనారాయణ ఓ డీఎస్పీ తండ్రి
- గతంలోనూ జింకల వేట కేసులో నిందితుడు

పెగడపల్లి, మార్చి 19 : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామ శివారులో సోమవారం రాత్రి నెమలిని వేటాడి చంపిన ఘటనలో వేటగాళ్లను జగిత్యాల జిల్లా పెగడపల్లి పోలీసులు సోమవారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేశారు. నెమలి వేటగాళ్లలో ప్రధాన నిందితుడు ములుగు జిల్లాలోని ఓ డీఎస్పీకి తండ్రి కావడం గమనార్హం. ఇతడు గతంలోనూ జింకల వేట కేసులో నిందితుడు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మంగళవారం పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ రఘుచందర్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన నలువాల సత్యనారాయణ (63), జగిత్యాల మండలం మల్యాలకు చెందిన జవ్వాజి రాజు కారు డ్రైవర్‌తో కలసి సోమవారం సాయంత్రం పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామ శివారులో తుపాకీతో నెమలిని వేటాడి చంపారు. దానిని కారులో తీసుకుని వెళ్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు పెగడపల్లి ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో వెళ్లి కారును ఆపి తనిఖీ చేశారు. కారులో నెమలి కళేబరంతో పాటు లైసెన్సు లేని తుపాకీ, గొడ్డలి ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నెమలిని వేటాడి తానే చంపినట్లు పోలీసుల విచారణలో నిందితుడు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశారు. నిందితుడి వద్ద నుంచి 0.22 స్పోర్టింగ్ రైఫిల్ అని రాసి ఉన్న తుపాకీతో పాటు 34 నిండు తూటాలు, ఒక కాల్చిన తూటా, గొడ్డలి, ఏపీ 15 బి 8093 నంబరు గల కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సత్యనారాయణతోపాటు డ్రైవర్ జవ్వాజి రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిందితుడు సత్యనారాయణ 2017 లో భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ ప్రాంతంలో జింకల వేట కేసు లోనూ ప్రధాన నిందితుడని ఇతడికి వన్యప్రాణుల వేట అంటే మక్కువ అని తెలుస్తోందని డీఎస్పీ తెలిపారు.


పెగడపల్లిలో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, మార్చి 19 : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాతంకు చెందిన ఆల్లేశ్వరం శంకర్ (45) అనే వ్యక్తి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు మంగళవారం ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన శంకర్ కర్నాటక రాష్ట్రంలోని బెంగళూర్ పట్టణంలో వడ్రంగిగా పనిచేస్తూ జీవించేవాడని అక్కడ ఉన్నపుడు అతనికి గుండె సమస్యతో ఆసుపత్రిలో చేరగా వైద్యులు శంకర్‌కు గుండె శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల క్రితం కోరుట్లకు వచ్చిన శంకర్ పట్టణంలో వడ్రంగి పని చేస్తుండేవాడని తెలిపారు. శంకర్ అవసరాల నిమిత్తం ప్రైవేట్ బ్యాంక్‌లతో పాటు బంధువుల వద్ద అప్పుచేసినట్లు వివరించారు. అప్పులు ఎలా చెల్లించాలని భార్యతో పాటు కుటుంబ సభ్యులకు చెప్పుకుంటూ నిరంతరం బాధపడేవాడని తెలిపారు. గత వారం రోజుల క్రితం బ్యాంక్‌కు చెందిన వారు రుణం చెల్లించాలని ఫోన్ చేయగా అప్పటి నుంచి బాధపడుతూ మంగళవారం వేకువజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాలుపడినట్లు ఎస్‌ఐ తెలిపారు. శంకర్ భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

- జగిత్యాల అడిషనల్ సెషన్ జడ్జి తీర్పు

వెల్గటూర్, మార్చి 19: మండలంలోని ముత్తునూర్ గ్రామానికి చెందిన సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్య అనే ఇద్దరు వ్యక్తులకు 2009లో జరిగిన బైరం దామోదర్ హత్య కేసులో జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధిస్తూ జగిత్యాల అడిషనల్ సెషన్ జడ్జి సుగాలి నారాయణ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం ముత్తునూర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు బైరం దామోదర్, సింగం రాజయ్య అదే గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన సీపతి ప్రభాకర్, సింగం రాజయ్యలకు పొలం వద్ద నీరు విషయంలో గొడవ జరిగింది. పాత కక్షలను మనసులో పెట్టుకొన్న సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్య సహాయంతో 2009 డిసెంబరు 24న సింగం రాజయ్యను చంపాలని అతని పొలం వద్ద మాటు వేశారు. సింగం రాజయ్య పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో అక్కడే ఉన్న సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలు కత్తులతో హత్య చేయాలని వెంబడించగా రాజయ్య గ్రామం వైపు పరుగెత్తాడు. అదే సమయంలో పొలం పనులు ముగించుకొని వెళుతున్న సింగం రాజయ్య స్నేహితుడు బైరం దామోదర్‌ను సీపతి ప్రభాకర్, నేరెల్ల రాజయ్యలు కత్తులతో మెడ, పొట్ట భాగంలో పొడవడంతో బైరం దామోదర్ అక్కడికక్కడే మృతి చెందాడు. దామోదర్ సోదరుడు లచ్చయ్య ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు సీపతి ప్రభాకర్, నేరెళ్ల రాజయ్యలను కోర్టులో హాజరు పరిచారు. కేసును విచారించిన అడిషనల్ సెషన్ జడ్జి సుగాలి నారాయణ ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు, రూ.5 వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. ఈ కేసులో అడిషనల్ పీపీ మల్లేశం, ఇన్వెస్టిగేషన్ అధికారులు దామెర నర్సయ్య, సీఎంఎస్ ఎస్‌ఐ రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ ఎం. కిరణ్ కుమార్ నిందితులకు శిక్ష పడడంలో కోర్టుకు సాక్ష్యాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. నిందితులకు శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

సీవోఈలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

తిమ్మాపూర్, మార్చి19: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం(సీఓఈ)లో 2024-25 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ జి.దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఓఈలో బాలురకు(80), బాలికలకు(80) సీట్లు ఉన్నట్లు తెలిపారు. ప్రవేశము పొందిన విద్యార్థులకు 9వ తరగతి సిలబస్‌తో పాటు ఐఐటి ఫౌండేషన్ కోర్సు, నీట్ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ ఉచితంగా అన్ని సౌకర్య ములు కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యా ర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, అసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కొరకు ఫోన్.7337349518కు సంబంధిన వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కొండగట్టులో భక్తుల రద్దీ


ఆలయం ముందు భక్తులు

మల్యాల, మార్చి 19: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు అంజన్నతో పాటు శ్రీరాముల వారిని బేతాళుడిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. అయితే ఎండల తీవ్రత నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న చలువపందిళ్ల పనులు నత్తనడకన సాగుతుండడంతో భక్తులు అసౌకర్యానికి గురి అవుతున్నారు.

ఇంటి వద్ద తండ్రి మృతదేహం

- బాధను దిగమింగుకుని పరీక్ష రాసిన అన్నదమ్ములు

పెగడపల్లి, మార్చి 19: విధి పరీక్ష పెట్టినా ధైర్యంగా ఎదుర్కొన్నారు.. ఆ అన్నదమ్ములు. నాన్న చనిపోయాడని తెలిసి అంత్యక్రియలు నిర్వహించాల్సిన సమయం అయినా పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని పదోతరగతి పరీక్ష రాశారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని బతికెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన గాజె రాము, లక్ష్మణ్ కవల పిల్లలు. వీరు పదో తరగతి చదువుతున్నారు. రాము, లక్ష్మణ్ తండ్రి చంద్రయ్య(50) ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆ అన్నదమ్ములు బాధను దిగమింగి మంగళవారం జరిగిన పరీక్షకు హాజరయ్యారు. అనంతరం తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు.


పరీక్ష రాసి బయటకు వస్తున్న రాము, లక్ష్మణ్

మాజీ భర్తపై భార్య యాసిడ్ దాడి

ఇబ్రహీంపట్నం, మార్చి 19: మాజీ భర్తపై ఓ మహిళ యాసిడ్ దాడి చేసిన ఘటన మండలంలోని ఎర్దండి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్దండి గ్రామానికి చెందిన నీరటి మహేష్ మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామానికి చెందిన మాస లక్షణను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. కొంత కాలంగా దంపతులకు మనస్పర్థలు రావడంతో 2023లో మహేష్, లక్షణ కోర్టు నుంచి విడాకులు తీసుకున్నారు. మహేష్ మరో యువతిని పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకుని ఈ నెల 20న పెళ్లికి సిద్ధం అయ్యాడు. విషయం తెలుసుకున్న మాజీ భార్య లక్షణ మహేష్‌పై కక్ష పెట్టుకుని మంగళవారం మహేష్ ఇంటికి వెళ్లి అతను ఇంటి నుంచి బయటకు రాగానే యాసిడ్‌తో దాడి చేసింది. దీంతో మహేష్‌కు వీపు, ఎడమ కన్నుపై భాగంలో స్వల్ప గాయాలయ్యాయి. మహేష్ ఫిర్యాదు మేరకు లక్షణపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

జైలుకు ఆహార పదార్థాల సరఫరాకు టెండర్లు

కరీంనగర్ క్రైం, మార్చి19: జిల్లా జైలులో ఆహార పదార్థాలు, వస్తువులు, వివిధ రకాల స్టీల్ ఫర్నిచర్ తయారీ ముడి సరుకు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. పప్పుదినుసులు, గోధుమలు, విజయ సన్‌ఫ్లవర్ ఆయిల్, బ్రూక్‌బాండ్ రెడ్‌లేబుల్ టీ పొడి, ఇతర వస్తువులతో పాటు స్టీల్ ఫర్నిచర్ తయారు చేసేందుకు ముడి సరుకు సరఫరా కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఏడాది కాలంపాటు వస్తువుల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

టెండర్లు మార్చి 23న తెరచి టెండర్‌లు ఖరారు చేయనున్నట్లు తెలిపారు. ఆహార పదార్థాలు, ఇతర వస్తువుల కోసం టెండర్ల దరఖాస్తు ఫారం ధర రూ.28, స్టీల్ ఫర్నిచర్ ముడి సరుకు దరఖాస్తు ఫారంకు రూ.110గా ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9494632431, 9494632451 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వైద్యసేవలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పరికరాలను పరిశీలిస్తున్న డాక్టర్ భాగీష్ మిశ్రా

సుభాష్‌నగర్, మార్చి19:మూగజీవాల వైద్య సేవలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర పశు ఆరోగ్య శాఖ 1962 ప్రాజెక్ట కో ఆర్డినేటర్ డాక్టర్ భాగీష్ మిశ్రా అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో 1962 సంచార పశు అంబులెన్స్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన వాహ నాన్ని నిర్వహిస్తున్న తీరు, అందిస్తున్న వైద్య సేవల పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ సలీం, కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీజ, డాక్టర్ అనూష, సహాయ సిబ్బంది రవళి, రాజ్‌కుమార్, రోష్ని తదితరులు పాల్గొన్నారు.

గీతామందిర సన్యాసమఠ వార్షికోత్సవాలు ప్రారంభం



ప్రవచనం చేస్తున్న స్వామీజీలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 19: నగరంలోని అశోక్‌నగర్‌లోని మళయాళ సద్గురు గీతామందిర సన్యాసమఠంలో మంగళ వారం 33వ వార్షికోత్సవాలు ప్రస్తుత మఠాధిపతి విష్ణుసేవా నందగిరిస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఘనంగా ప్రారంభ మయ్యాయి. ప్రణవ పతాకావిష్కరణ, దీప ప్రకాశనం, కలశ స్థాపన, భగవద్గీత, విష్ణు సహస్రనామ, లలితా సహస్రనామ పారాయణాలు, శ్రీకృష్ణపరమాత్మునికి అభిషేకం, పూజలు, సకల దేవతా హోమాలు జరిగాయి. ఉదయం, సాయంత్రం హైదరాబాద్-లలితాంబికా పీఠాధిపతి సంపూర్ణానందగిరిస్వామి అధ్యక్షతన తనతో పాటు విష్ణుసేవానందగిరిస్వామి (కరీంనగర్), సచ్చిదానందగిరిస్వామి (బ్రహ్మ విద్యాశ్రమం-తడపాకల), శుద్ధ బ్రహ్మానందగిరిస్వామి (ధ్యాన నిష్ఠా శ్రమం-గాగిళ్లాపూర్), రామచైతన్యస్వామి (చైతన్య తపోవన కుటీరం-శ్రీకాళహస్తి), చిత్తూరు శ్రీకృష్ణ గీతాశ్రమ చిదానందగిరిస్వామి, గంభీర్‌పూర్ దయానంద గీతాశ్రమ ఆత్మానందగిరిస్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

భగవన్నామ సంకీర్తనలు, భజనలు, పారాయణాలతో మందిరం మార్మోగింది. కార్యక్రమంలో అర్చకులు విష్ణుమూర్తిశర్మ, రామచంద్రశర్మ, చంద్ర మౌళితో పాటు బండ సత్తయ్య, గుండ రాధాకిషన్, బొడ్ల లక్ష్మీనారాయణ, కొండ శివలింగం, కమటాల శ్రీనివాస్, రాధారాణి, పద్మ, సత్యవతి, చంద్రకళ, భక్తులు పాల్గొన్నారు. కాగా నేడు బుధవారం ఏకాదశి ఉదయం నుంచి రాత్రి వరకు జప, ధ్యాన, పారాయణాలు, అభిషేకం, హోమాలు, స్వామీజీల ప్రవచనాలు, భజన, సంకీర్తనలు జరుగనున్నాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్, మార్చి 19: శాతావాహన విశ్వవిద్యాలయంలో వాణిజశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వారి సౌజన్యంతో నిర్వహించిన 'శాతవాహన వికల్ప' కార్యక్రమంలో హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఇందిరాదేవి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వ్యాసరచన, జస్ట్ ఎ మినిట్, క్విజ్, నృత్యం, రంగోలి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించుటకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిభ కనబర్చిన విద్యార్థులు అఖిల, స్రవంతి, సాయి కుమార్, జశ్వంత్, భవానీ, బాలస్వామి, రాజీ, నాగరాజు, రమ్య, స్రవంతి, శ్రీవలి, మధులత, నిఖితలను కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, అధ్యాపకులు పరమేష్, లక్ష్మీనర్సింహమూర్తి, గంగిశెట్టి శ్రీనివాస్, దినకర్, ఉదయశ్రీ, సమ్మయ్య, రాజ్‌కుమార్, రమేష్, స్వప్న, స్వరూప తదితరులు అభినందించారు.

22న ఇసుక బహిరంగ వేలం

వీణవంక, మార్చి19: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన నాలుగు టాక్టర్ల ఇసుకను బహిరంగ వేలం వేస్తున్నట్లు ఇన్‌చార్జి తహశీల్దార్ నిజామొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు టాక్టర్ల ఇసుకను పోలీసులు పట్టుకొని కోర్టుకు పంపించారు. వేలంలో పాల్గొనే వారు ట్రిప్పుకు 1800 చొప్పున 22వ తేదీలోపు డిపాజిట్ చేయాలని కోరారు.

పశు సంచార వైద్యశాల వాహనం తనిఖీ



పశు సంచార వైద్య సిబ్బందితో డాక్టర్ భాగేష్ మిశ్రా

హుజూరాబాద్, మార్చి 19: హుజూరాబాద్ పట్టణంలో 1962 పశు సంచార వైద్యశాల వాహనాన్ని రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ భాగేష్ మిశ్రా మంగళ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలోని పరికరాల పనితీరు, మందులు, రికార్డులను పరిశీలించారు. 24గంటలు సేవలందించే విధంగా ఉన్నాయని, వారి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ సలీం, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఏఎఫ్ఈ శ్రీనివాస్, సిబ్బంది డాక్టర్ వినిషా, రోషిని, రమేష్, శివకోటి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీఈవో

రామడుగు, మార్చి 19: మండలంలోని రామడుగు, గోపాల్‌రావుపేట గ్రామాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, స్పెషల్ స్క్వాడ్ శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రావు సందర్శించారు.

● మానకొండూర్: మండలంలోని మానకొండూర్, ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పదోతరగతి పరీక్షా కేంద్రాలను కరీంనగర్ మండల విద్యాధికారి వేణు మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని చీఫ్‌సూపరిండెంట్లకు సూచించారు. రెండవ రోజు మండలంలోని మూడు కేంద్రాలలో ఎవరూ గైర్హాజరు కాలేదు.

30 ఏళ్ల సేవకు గుర్తింపుగా పదవి

-మంత్రులు, పొన్నం, శ్రీధర్‌బాబు సహకారంతో అభివృద్ధికి కృషి

-సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 19: కాంగ్రెస్ పార్టీకి 30 ఏళ్లగా సేవలు అందించానని, గుర్తింపుగానే తనకు పదవి కట్టబెట్టారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నానని అన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుల సహకారంతోనే టీపీసీసీ అధికార ప్రతినిధి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదవులు పొందానని, మంత్రి పొన్నంకు తనకు మధ్య విభేధాలు లేవని కొట్టిపారేశారు. తన సేవలను గుర్తించి సుడా చైర్మన్‌గా నియామకం చేసినందుకు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. నాలుగేళ్లలో కాంగ్రెస్ పార్టీని కొందరు అవహేళన చేశారని, 30 మంది కూడా లేరంటూ ఎద్దేవా చేసినా వెనకడుగు వేయకుండా ప్రజల సమస్యలపై పోరాటం చేశామన్నారు. కాంగ్రెస్‌పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్‌ను కూడా నగరంలోని అన్ని డివిజన్‌లలో కలిపి 16 వేల సభ్యత్వం పూర్తి చేశామన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కోసం చివరి నిమిషం వరకు ప్రయత్నం చేశానని, తనకు అవకాశం దక్కకపోయినా పార్టీ అధిష్ఠానం హామీతో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశానని కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు 6 గ్యారంటీలపై ఇంటింటి ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకువెళ్లామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి 37 కార్పొరేషన్‌లకు చైర్మన్‌లకు నియామకం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి సేవలందించిన, విధేయులుగా పనిచేసిన మరికొందరికి కూడా అవకాశం కల్పించాలని నరేందర్‌రెడ్డి కోరారు. కరీంనగర్‌పై పూర్తి అవగాహన ఉందని సుడా చైర్మన్‌గా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల సహకారంతో అభివృద్ధి చేస్తానని అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను స్వీకరించి గుర్తింపు తెచ్చుకునేలా పనిచేస్తానని అన్నారు. మానేరు వాగులో చెక్‌డ్యాంల నిర్మాణంలో నాణ్యత లోపంతో కొట్టుకుపోయాయన్నారు. 250 కోట్లు రికవరీ చేయాలని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశానని, విచారణ జరుగుతుందని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. ఈ మీడియా సమావేశంలో నాయకులు శ్రావణ్‌నాయక్, దన్నా సింగ్, అరుణ్‌కుమార్, గుండా శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ అఖిల్, కమ్రొద్దీన్, విక్టర్ తదితరులున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

కరీంనగర్ కల్చరల్, మార్చి 19: జిల్లా కేంద్రానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణరావు (అవధానం), అన్నవరం శ్రీనివాస్ (చిత్రకళ) తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తంగెడ కిషన్‌రావు మంగళవారం ఫోన్ ద్వారా సమాచారం అందించగా రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా వీరిరువురూ ఈ నెల 28న హైదరాబాద్‌లో పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, సాహిత్య, కళాభిమానులు ఇద్దరికీ అభినందనలు తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల సంఘం కమిటీ

సుభాష్‌నగర్, మార్చి19: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం కమిటిని ఎన్నుకున్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో సర్వసభ్య సమావేశం ఏర్పటు చేసి కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పామరాజు రామరాజు, ఉపాధ్య క్షులుగా జీఎస్ ఆనంద్, కెమసారం సమ్మయ్య, గొడిశెల సతీష్, బొల్లం లింగమూర్తి, కలర్ సత్తన్న, ఉప్పు రవీందర్, డాక్టర్ ఎస్ దిలీప్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా దయాల ఓంప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా మండ వెంకన్న, పొన్నం శ్రీధర్, ఖుద్దూస్, వంగల వెంకటేశ్వర్లు, గడప కోటేశ్, ఎండి అజీజ్, బషీర్, కార్యదర్శులుగా బత్తిని శ్రీనివాస్, కొమిడి తిరుమల రెడ్డి, కాళిదాస్ రేణుక, ఖాదర్‌ఖాన్, తాటి ప్రభావతి, వొల్లల శ్రీనివాస్, కోశాధికారిగా గొడిశెల రమేశ్, మీడియా కార్యదర్శిగా నవీన్, వొడ్నాల రాజు, పబ్లిసిటీ కార్యదర్శులుగా బండి శ్రీనివాస్, కడారి ఐలయ్య, సభ్యులుగా అర్వి రేణుక, కె లావణ్య, మహదేవుని భార్గవి, కర్నాల శ్రీనివాస్, గుండ్ల శ్రీధర్, గుండ అన్నపూర్ణ, మర్రిపెల్లి మహేందర్‌లను ఎన్నుకున్నారు.

● **గుర్తింపు కార్డులను అందించాలి**

తెలంగాణ ఉద్యకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను అందించాలని అధ్యక్షుడు పామరాజు రామరాజు, ప్రధానకార్యదర్శి దయాల ఓంప్రసాద్ డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు గల వారికి పెన్షన్ ఇవ్వాలని, ఇళ్ళ స్థలాలు, బస్‌పాసులు అందించాలని, ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఉద్యకారుల కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు అందించాలని, వారి పిల్లలకు ఉచిత విద్య అందించాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘ భవనం ఏర్పాటు చేయాలని, ఉద్యమకారుల కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, ఉద్యమకారుల పిల్లల వివాహానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

జాతీయ యోగా పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 19: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హుబ్లీలో ఈనెల 19 నుంచి 23 వరకు నిర్వహించనున్న 48వ జాతీయ స్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపిక య్యారని జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని మానేరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చరణ్ తేజ, ఎం.శకుంతల, శ్రీనిధి (కరీంనగర్), ఆమని (సుల్తానాబాద్), ఆర్.శ్రీనివాస్ (పెద్దపల్లి), హసీనాబేగం, బి.వెంకటేశం (గోదావరిఖని)లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ క్రీడాకారులను రాష్ట్ర యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి జాల మనోహర్‌కుమార్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, యోగా శిక్షకులు ముప్పాల శ్రీనివాస్, విజయ్ కుమార్, మనోజ్, వి.కిష్టయ్య, రామకృష్ణ, మల్లేశ్వరీలు అభినందించారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఎఎంరెడ్డి

సుభాష్‌నగర్, మార్చి 19: ఆరోగ్యంపై అందరికీ అవగాహన ఉండాలని కేర్ హోమియోపతి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ ఎం రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో డాక్టర్ కేర్ ఆధ్వర్యంలో థాంక్యూ డాక్టర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల మన ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నామని అన్నారు. ఇష్టానుసారంగా మందులను వాడుతున్నారని, పర్యావసనంగా అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. హైదరాబాద్ కంటే కరీంనగర్ లాంటి జిల్లాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లోనే ఆరోగ్యంపట్ల అవగాహన తక్కువగా ఉందన్నారు. హోమియో వైద్యంలో అన్ని వ్యాధులకు మందులు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో థాంక్యూ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఇందులో హోమియో మందులు వాడిన వారి అభిప్రాయాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నీరజ, డాక్టర్ భార్గవి, డాక్టర్ రమేశ్, డాక్టర్ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు రాక ఉపాధి కూలీల అవస్థలు



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

చిగురుమామిడి, మార్చి 19: చిగురుమామిడి మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న 18 సిబ్బందికి గత మూడు నెలల నుండి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. డిశంబరు నుంచి నేటి వరకు వారికి రావాల్సిన జీతాలు రాక పోవడంతో వారి కుటుంబలను పోషించుకోవడం కష్టతరంగా మారింది. మండంలంలో 17గ్రామాల ఉన్నాయి. ఇందుకు గునుకు లపల్లి, సీతారాంపూర్, చిన్నముల్కనూర్ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేరు. అదే గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శి గునుకులపల్లిలో, సీతారాంపూర్, చిన్నముల్కనూర్ గ్రామాల్లో సీనియర్ మేట్లతోనే పనులు నిర్వహిస్తున్నారు. మిగిత 14 గ్రామాల్లో రెగ్యులర్‌గా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు విధులు నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్‌లు, సీవో ఒక్కరు, ఇసి ఒక్కరు మొత్తం 18 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి మూడు నెలల నుంచి జీతాలు రాక కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారింది. గతంలో ఇదే విధంగా ఉన్న నేపథ్యంలో ఆందోళనలు చేస్తే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సిబ్బందిని విధుల నుంచి తొలగించింది. దీంతో వీరి గోడు చెప్పకోవడానికి సిబ్బంది జక్కుతున్నారు. చాలీచాలని జీతలతో కుటుంబలను పోషించుకోలేక పోతున్నారు. తమ కష్టాలను పట్టించుకునేవారు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 14 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లకు 12వేల చొప్పున మూడు నెలలకు రావల్సి జీతాలు రూ. 5లక్షల 4 వేలు, 2 టీఎలకు 48వేల 750 రూపాయాలు, సిఒకు 84 వేలు, ఈసి 1.56 లక్షల మొత్తం మండల సిబ్బందికి రావల్సిన జీతాలు 7లక్షల92 వేల750 రూపాయలు రావాల్సి ఉంది. ప్రభుత్వం వీరి పట్ల చిన్న చూపు చూస్తూ జీతాలను సకాలంలో ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. తమ కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని, జీతాలను సకాలంలో ఇచ్చి కుటుంబాలను అదుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

జీతాలు లేక అవస్థలు పడుతున్నాం

- అలువాల శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉల్లంపల్లి

మేము జీతం మీద ఆధారపడి కుటుంబం పోషించుకుంటున్నాం. మాకు రావాల్సిన జీతాలు సకాంలో జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జీతాలు చెల్లించి తమ కుటుంబలను ఆదుకోవాలి.

విధులు నిర్వహిస్తున్నాం.. జీతాలు రావడం లేదు..

బండారి పల్లి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్, లంబాడిపల్లి

గ్రామాల్లో ప్రతి రోజు అధికారులు పెట్టిన టార్గెట్ ప్రకారం పనులు నిర్వహిస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి కూలీకి పనికల్పిస్తున్నాం. కానీ మాకు జీతాలు మూడు నేలలు అయినా ఇవ్వడం లేదు. ఇప్పటికైనా వేతనాలు అందించాలి.

బీఆర్ఎస్‌లో చేరిన జక్కని సంజయ్‌కుమార్



సంజయ్‌కుమార్‌కు కండువా కప్పుతున్న కేసీఆర్

శంకరపట్నం, మార్చి 19: బీఎస్పీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ బీఎస్పీ సభ్యత్వానికి రాజీనామా చేసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధ్వ ర్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రబెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో జరిగిన సమావేశంలో జక్కని సంజ య్‌కుమార్ కేసీఆర్ చేతుల మీదుగా బీఆర్ఎస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. 2023 ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా అప్పటి సీఎం కేసీఆర్‌పై పోటీ చేశారు.

మహిళలు, శిశువులకు సంపూర్ణ పోషకాహారం



మహిళలకు బహుమతులు అందిస్తున్న సీడీపీవో కస్తూరి

గంగాధర, మార్చి 19: మహిళలకు, శిశువులకు సంపూర్ణ పోషకాహారం అందించడానికి కేంద్ర ప్రభుత్వం పోషణ పఖ్వాడ కార్యక్రమం నిర్వహిస్తుందని సీడీపీవో కస్తూరి పేర్కొన్నారు. మంగళవారం గంగాధర పీహెచ్‌సీలో పరీక్షలకు వచ్చిన గర్భిణీలకు పోషణ పక్వాడ గురించి వివరించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి బలమైన ఆహారాన్ని అందించడమే కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. గర్భిణీలు ఐరెన్, ప్రొటీన్, కాల్షియం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు క్విజ్ పోటీలను పెట్టి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలకు రాగిజావ, చిక్కుల్లు, అరటి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్వేతారాణి, మహేశ్వర్‌రావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ప్రశాంతి, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి 19: నగరంలో కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. 11కేవి వరలక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని రెడ్డి ఫంక్షన్‌హాలు వెనుకవైపు, సాయిరాంనగర్ రోడ్ నంబరు-2 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయాల హుండీల లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, మార్చి19: నగరంలోని దేవాదాయశాఖ పరిధిలోని రెండు ఆలయాల హుండీలను సుమారు ఆరు నెలలకుగాను మంగళవారం లెక్కించారు. కోతిరాంపూర్ పోచమ్మ దేవాలయ హుండీలను లెక్కించగా 3,44,486 రూపాయల ఆదాయం, రాంపూర్ గిద్దెపెరుమాళ్ళ ఆలయ హుండీలను లెక్కించగా 82,800 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆయా ఆలయాల ఈఓ ఎండపెల్లి మారుతి తెలిపారు. లెక్కింపులో ఈఓ మారుతితో పాటు పర్యవేక్షకునిగా జూనియర్ అసిస్టెంట్ కొత్తకొండ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ గుడికాడి శ్రీనివాస్, పోచమ్మ ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పెండ్యాల వేంకటేశ్వర్‌రావు, గిద్దెపెరుమాళ్ళ ఆలయ అర్చకుడు రామక శంకరశర్మ, భక్తులు, గోవిందపతి శ్రీవారి సేవా సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

చెస్ బోర్డుల పంపిణీ

సుభాష్‌నగర్, మార్చి19: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెస్ బోర్డులన పంపిణి చేశారు. మంగళవారం స్థానిక హౌజింగ్ బోర్డు కాలనీలోని గాయత్రినగర్‌లోగల కపిల్ బాల కిటీర్‌లో ఉంటున్న విద్యార్థులకు చెస్‌బోర్డులు, పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ధనపురి సాగర్ మాట్లాడుతు విద్యతో పాటు వివిధ రకాల ఇండోర్ ఆటలు ఆడడం వల్ల పిల్లలు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారు అవుతారని అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో వార్షిక పరీక్షల అనంతరం ఇండోర్ ఆటలు ఆడించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. చిందం రమేశ్, చిందం ప్రణీత, సంస్థ సంయుక్త కార్యదర్శి గోగురి శ్రీధర్‌రెడ్డి, హిమసాయి, కె మన్‌సాయి, బాలకుటీర్ ఇంచార్జీ వకుళ, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల పరామర్శ



లక్ష్మీపూర్‌లో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

చొప్పదండి, మార్చి 19: మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోలాపురి మల్లేశం తల్లి మరణించగా మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మల్లేశం కుటుంబానికి రూ.5వేల నగదుతోపాటు బియ్యం బస్తా అందజేశారు. ఆయన వెంట నాయకులు గుర్రం భూంరెడ్డి, ముద్దసాని రంగన్న, మునిగాల సుధాకర్, మునిగాల రాజేందర్, నిజానపురం చందు, పెద్ది రాజేందర్, మండల లక్ష్మయ్య, కొలపూరి శ్రీకాంత్ ఉన్నారు.

● మానకొండూర్ : మండలంలోని పోచంపల్లి, పచ్చునూర్, లక్ష్మీపూర్ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం పరామర్శించి తన ప్రగాఢ సానుబూతి తెలియజేశారు. ఈయన వెంబడి మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవీంద్రాచారి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, తిరుమల్‌రెడ్డి, భద్రయ్య, అశోక్ ఉన్నారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లిని కలిసిన నాయకులు



నరేందర్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మార్చి19: శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్మన్(సుడా)గా నియమితులైన కరీంనగర్ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నరేందర్‌రెడ్డిని శాలవాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

గంగాధర, మార్చి 19: గంగాధర మండలం వెంకటయ్యపల్లికి చెందిన మాజీ సర్పంచ్ కల్లెపెల్లి భూదమ్మ మంగళవారం మృతి చెందారు. గ్రామానికి బూదమ్మ ఏడేళ్లుగా సర్పంచ్‌గా సేవలందించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది.

మిల్లెట్లపై అవగాహన

రామడుగు, మార్చి 19 : మండలంలోని గుండి, గోపాల్‌రావుపేటలోని సీహెచ్‌సీలో మిల్లెట్లపై తల్లులు, గర్భిణీలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గ్రీష్మ, సూపర్‌వైజర్ సుధారాణి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలు , తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

సిరిసిల్ల క్రైం, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లాలోని తం గళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గంభీరావుపేట మండలంలోని పెద్దమ్మ స్టేజి వద్ద చెక్‌పోస్టు, ముస్తాబాద్ మండల పరిధిలోని వెంకట్రావుపల్లి చెక్‌పోస్టు, వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు, బోయినపల్లి మండలంలోని కొదురుపాక చెక్‌పోస్టు, రుద్రంగి మండలంలోని మానాల క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ చెక్‌పోస్టు వద్ద నిరంతరం తనిఖీలునిర్వహిస్తారన్నారు. మద్యం, డబ్బు అక్రమంగా సరఫరా కాకుండా నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి మద్యం, డబ్బు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.